రహదారి విస్తరణపై అధికారుల మీనమేషాలు

- వైఎస్ జగన్ హయాంలోనే రూ.కోట్లతో అనుమతులు
- పనుల నిర్వహణపై కూటమి ప్రభుత్వం అలసత్వం


విస్తరణ చేపట్టాల్సిన రహదారి


మార్కింగ్ పనుల్లో సిబ్బంది(ఫైల్)

ముద్దనూరు : ఒక పక్క మురుగునీరు పారుదల, మరో పక్క దుమ్ము, ధూళి కాలుష్యం, అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్, చిన్న చిన్న ప్రమాదాలు ఇవి ముద్దనూరులో నిత్యం ప్రజలు చవిచూస్తున్న సమస్యలు. ఈ సమస్యల శాశ్వత నివారణకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే సుమారు రూ.7 కోట్ల వ్యయంతో జాతీయ రహదారి విస్తరణ, డ్రైనేజి నిర్మాణం పనులు మంజూరయ్యాయి.

స్థానిక 4 రోడ్ల కూడలి నుంచి ప్రధాన రహదారిగుండా రైల్వేగేటు వరకు రహదారి విస్తరణ చేపట్టడానికి నిధులు మంజూరయ్యాయి. అయితే కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను విస్మరించింది. సుమారు 3 నెలల క్రితం జాతీయరహదారి అధికారులు హడావిడిగా రెండు సార్లు సర్వే చేశారు. సర్వే, మార్కింగ్ ప్రక్రియ కూడా పూర్తైంది. పదిరోజుల్లో పనులు మొదలవుతాయని ఎన్‌హెచ్ అధికారులు తెలిపారు. ఇంతవరకు రహ దారి విస్తరణపై అతీగతి లేదు. 1 కి.మీపైగా రహదారికి ఇరువైపులా నివాస, వ్యాపార గృహాలున్నాయి. రహదారి ఇరుకుగా వుండటంతో ప్రమాదాలు, భారీగా దుమ్ము కాలుష్యం, ఇళ్ళ నుంచి రహదారిపైకి ప్రవహించే నీరుతో ప్రజల ఇబ్బందులు వర్ణణాతీతంగా వున్నాయి. ఎన్నో దశాబ్దాలుగా ఎదురు చూసిన రహదారి విస్తరణ పనులను ప్రారంభించి పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే ప్రశ్న స్థానికుల్లో తలెత్తుతోంది. రహదారి వెడల్పు, రోడ్డుకు ఇరుప్రక్కల డ్రైనేజి పనులు చేపట్టాల్సివుంది. ఇప్పటికే సుమారు 3 నెలలు కాలం వృథా అయ్యిందని కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులను పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

కోనగవేశ్వరుడికి నేడు ప్రత్యేక పూజలు


కోనగవేశ్వరస్వామి

పులివెందుల రూరల్ : మండలంలోని మోట్నూతలపల్లె గ్రామ సమీపంలో వెలసిన కోనగవేశ్వరుడికి కార్తిక చివరి సోమవారం, ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో తెల్లవారుజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. దాతలు ఆలయ అభివృద్ధికి సహకరించాలన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.

విద్యుత్ అంతరాయంతో ఇక్కట్లు

ముద్దనూరు : మండలకేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో వినియోగదారులు ఇబ్బందిపడ్డారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌ఫారం ఏర్పాటులో భాగంగా సరఫరా నిలిపివేసినట్లు సమాచారం. ముందస్తు సమాచారం లేకుండా సెలవురోజులో విద్యుత్ సరఫరా ఆపివేయడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా సపోజ్ క్రిస్మస్ వేడుకలు


సపోజ్ క్రిస్మస్ వేడుకలను ప్రారంభించిన ఎస్పీజీ క్వార్టర్స్ చర్చి ఫాదర్

జమ్మలమడుగు : పట్టణంలోని ఎస్పీజీ క్వార్టర్స్‌లో ఉన్న సీఎస్‌ఐ చర్చిలో ఘనంగా సపోజ్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి చర్చిలో మత గురువు జనర్ధాన్‌బాబు ఆధ్వర్యంలో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభం అయినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేసిన ఎన్‌సీసీ విద్యార్థులు


దుప్పట్ల పంపిణీకి సిద్ధమైన ఎన్‌సీసీ విద్యార్థులు

జమ్మలమడుగు : పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఎన్‌సీసీ విద్యార్థులు దుప్పట్లు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆదివారం ఎన్‌సీసీ డే సందర్భంగా ఎస్వీ డిగ్రీకాలేజి కరస్పాండెంట్ పాల నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అన్నారు. ఎన్‌సీసీ ఉన్న విద్యార్థుల్లో దేశ భక్తి పెంపొందించడంతో పాటు అందరు ఒక్కటే అనే భావన ఏర్పడుతుందన్నారు. దీని ద్వారా రిజర్వేషన్లు కూడా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్ట్‌నెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కళాశాల బోర్డు



పులివెందుల రూరల్ : పార్నపల్లె రోడ్డులోని చిన్నరంగాపురం గ్రామ సమీపంలో ఉన్న ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల బోర్డు శిథిలావస్థకు చేరుకుంది. బోర్డు చుట్టు ముళ్ల పొదలతో నిండిపోయింది. ప్రతి రోజు కళాశాలకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు బోర్డు ముందే వెళ్తుంటారు. కానీ శిథిలావస్థలో ఉన్న బోర్డు మాత్రం కనిపించదు. అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ముళ్ల పొద ల మధ్య శిథిలావస్థలో ఉన్న ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల బోర్డును మార్చాల్సిన అవసరం ఉంది.

మాధవరం చేనేతలతో జిల్లాకు ఖ్యాతి

కడప కల్చరల్ : జిల్లాలో నేతన్నలు ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన చేనేతలు ఎంతో ఖ్యాతి గడించి పెట్టాయని, అందులో మాధవరం చేనేతలు ముఖ్యమైనవని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ(ఇంటాక్) జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు.

28న శివ పార్వతుల కల్యాణం

కమలాపురం : పట్టణంలోని పడమట వీధిలో వెలసిన శ్రీ పాతాళ సోమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 28వ తేదీన శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు మధుసూదన శర్మ, సాయి నిఖిల్ శర్మ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండలంలోని శివ దీక్షా కమిటీ ఆధ్వర్యంలో ఈ కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఉదయం 9.40 గంటలకు శివ పార్వతుల కళ్యాణం, సాయంత్రం 4గంటలకు స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నామని, భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

వ్యవసాయ పరికరాలు ధ్వంసం

ముద్దనూరు : మండలలోని గంగాదేవిపల్లె పొలంలోని వ్యవసాయ పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బాధిత సుధాకర్‌రెడ్డి సమాచారం మేరకు శనివారం అర్ధరాత్రి సమయంలో పొలంలోని మోటరు స్టాటరు, ఆటో స్టాటరు, పైపులను ధ్వంసం చేసినట్లు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

మానవత సేవలు ఎనలేనివి


ఆర్డీఓ భానుశ్రీని సత్కరిస్తున్న మానవతా సేవాసంస్థ ప్రతినిధులు

పులివెందుల టౌన్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు ఎనలేనివని ఆర్డీఓ భానుశ్రీ తెలిపారు. ఆదివారం సేవా సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాసేవ చేయాలనే దృఢ సంకల్పంతో నేను ఉద్యోగ జీవితంలో అడుగుపెట్టానన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న నేను పేద ప్రజలకు సేవ చేసే ఆలోచనతోనే ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. మానవతా సేవా సంస్థను గురించి తాను ఇదివరకే విన్నానని సేవా కార్యక్రమాలను గురించి కూడా తెలుసుకున్నానన్నారు. మానవతా సేవా సంస్థకు నావంతు చేయూతనందిస్తానన్నారు. సంస్థ చైర్మన్ దీవి కొండారెడ్డి, రీజియన్ కన్వీనర్ జి.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చవ్వా కృష్ణారెడ్డిలు మానవతా ఆశయాలను పనితీరు చేపట్టే సేవా కార్యక్రమాలు గురించి వివరించారు. అనంతరం ఆర్డీఓను వారు సత్కరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు మెజిస్ట్రేట్ శ్రీనివాసులు, కార్యదర్శి గంగిరెడ్డి, ఎస్సీ ఎస్సార్ అధినేత సొరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వై.శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5న బర్సీ మహోత్సవం

కమలాపురం : కమలాపురం పెద్ద దర్గాగా విరాజిల్లుతున్న హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం డిసెంబర్ 5వ తేదీన వైభవంగా నిర్వహించనున్నామని దర్గా కన్వీనర్, వైఎస్సార్ సీపీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు గంధం ఊరేగింపు నిర్వహిస్తామని అనంతరం ప్రత్యేక ఫాతెహా నిర్వహిస్తామన్నారు. తదనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా గంగమ్మకు పూజలు


విశేష అలంకారంలో గంగమ్మతల్లి

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి పట్టు వస్త్రాలతో పూలదండలతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు ఘనంగా అభిషేకాలు పూజలు నిర్వహించి తమ ఇష్ట దైవాన్ని దర్శనం చేసుకుని కానుకలు సమర్పించుకున్నారు. భక్తులకు దర్శన ఏర్పాట్లను, తగిన సౌకర్యాలను ఆలయ ఈవో రవిశేఖర్‌రెడ్డి చేశారు. ఆలయ ప్రాంగణంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

వర్షం నీటిని తరలించండి సారూ..


చిన్నచెప్పలి వాటర్ ట్యాంక్ వద్ద ఓ వీధిలో నిలిచి ఉన్న వర్షం నీరు

కమలాపురం : వారాల తరబడి నిల్వ ఉన్న వర్షం నీటిని తరలించండి సారూ.. అంటూ మండలంలోని చిన్నచెప్పలి గ్రామస్తులు కోరుతున్నారు. చిన్నచెప్పలి గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న ఓ ప్రధాన వీధిలో దాదాపు మూడు వారాలుగా వర్షం నీరు నిల్వ ఉన్నాయి. ఒక తుఫాను పోయి మరో తుఫాను వస్తున్నా ఆ నీరు అక్కడి నుంచి కదల లేదు. వారాల తరబడి నీరు నిల్వ ఉండటంతో ఆ నీటిలో విష కీటకాలు చేరుతున్నాయి. దోమల బెడద పెరిగింది. దుర్వాసన వెదజల్లుతోంది. రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ దారిలో నడవాలన్నా చాలా ఇబ్బందిగా ఉందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిల్వ ఉన్న వర్షం నీటిని తరలించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గౌరవ అంతిమ సంస్కారం ప్రతి జీవి కనీస హక్కు


అంతిమ సంస్కారంలో పాల్గొన్న చైర్మన్ కృష్ణతేజ

వేంపల్లె : గౌరవ అంతిమ సంస్కారం ప్రతి జీవి కనీస హక్కు అని గండి దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. ఆదివారం వేంపల్లె నుండి గండికి వెళ్లే రహదారి బలపాలగుట్ట సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో కోతి అక్కడికక్కడే మృతి చెందింది. మానవత దృక్పథంతో వీరన్నగట్టుపల్లికి చెందిన చిలంకూరు రామాంజి, తన కుమారుడు పవన్ పార్థివ దేహాన్ని వేంపల్లి పాపాగ్ని నది వద్దకు తీసుకువెళ్లి గౌరవ అంతిమ సంస్కారం నిర్వహించారు. వారు చేసిన ఈపని పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గండి దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, షేక్‌అబ్దుల్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిరస్మరణీయులు


ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్డి నాయకులు

పులివెందుల టౌన్ : బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన తొలిస్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిరస్మరణీయులు అని వైఎస్సార్ సీపీ నాయకులు హాల్ గంగాధర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ సర్వోత్తమరెడ్డిలు తెలిపారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డులో రెడ్డి కమ్యూనిటీ నాయకులతో కలసి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ముద్దనూరురోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రెడ్డి నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు రామలింగారెడ్డి, పులివెందుల రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ఎర్రగుంట్ల : స్థానిక మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని గౌతమ్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని సంస్థ వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషఫణిల చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రొద్దుటూరు మోక్షిత్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి గుండె వైద్య నిపుణులు భూపాల్‌రెడ్డి నేతృత్వంలో రోగులకు వైద్యం అందించారు. సుమారు 121 మంది రోగులకు వైద్యం అందించి మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో మానవత మండల శాఖ చైర్మన్ రఘురాంరెడ్డి, జిల్లా మండల శాఖ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, సెక్రటరీ రంగయ్య, మానవత సభ్యులు పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేంపల్లె : ఆవోపా ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన హోమియో వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్యశిబిరంలో సుమారు 85 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు వైద్యులు కృష్ణపాటి వెంకటశేషఫణి తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సునీల్‌కుమార్ మాట్లాడుతూ 2015 నుంచి ఆవోపా ద్వారా ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వైద్యశిబిరాన్ని ఆశోక్‌కుమార్ మొదలు పెట్టారన్నారు. ఆయన జ్ఞాపకార్థం సతీమణి కొప్పారపు నాగసుధామణి రూ.50 వేలు చెక్కును అందజేశారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలి


అన్నదాన కార్యక్రమలో పాల్గొన్న ఎస్‌ఐ

వేంపల్లె : ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలని ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలన్నారు. తన విధి నిర్వహణలో ఇలాంటి కార్యక్రమాలు చేశానని రానున్న రోజుల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు ముందుంటానన్నారు. మాజీ ఎంపీటీసీ జీవీ రమణ, మానవత చైర్మన్ చక్రఫాణిరెడ్డి, అధ్యక్షుడు పాతిరెడ్డి శ్రావన్, ఉపాధ్యక్షుడు యోగీశ్వరబాబు, నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వనభోజన కార్యక్రమం


వనభోజనాలు చేస్తున్న వీరశైవ లింగాయతీ సంఘం వారు

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీ రంగనాథస్వామి దేవస్థాన సన్నిధిలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శ్రీ వీరశైవ లింగాయతి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ రంగనాథస్వామికి అభిషేకాలు ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి కృష్ణరాజేష్ శర్మ నేతృత్వంలో నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘ నేత అంగడి నాగేంద్ర ఆధ్వర్యంలో పిల్లలకు మహిళలకు ఆటల పోటీలు, మ్యూజికల్ చైర్స్, పెద్దవారికి త్రోబాల్ నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. వీరశైవ లింగాయత్ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయల సాగు


జీవామృతాన్ని తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

లింగాల : మండలంలోని అక్కులగారిపల్లెలో ఆదివారం ప్రకృతి వ్యవసాయపద్ధతిలో కూరగాయల సాగుపై వ్యవసాయ అధికారి జయనాయక్ రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఎనీ టైం మనీ విధానం గురించి రైతులకు వివరించారు. విత్తన శుద్ధి చేసుకుని నీడలో ఆరబెట్టుకోవాలన్నారు. అలాగే ముందుగా చేసిన జీవామృతంను బెడ్ల మీద సాళ్లలో ముందుగా చల్లుకోవాలన్నారు. ఈ విధంగా వేసుకోవడం వల్ల నేలలో జీవ వైవిధ్యం పెరిగి నేలలో లోపించిన పోషకాలు సమృద్ధిగా పెరుగుతాయన్నారు.

ప్రభుత్వ సంస్థలను అమరావతికి తరలించడం దారుణ

జమ్మలమడుగు : వైఎస్సార్ జిల్లాలో ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలను అమరావతికి తరలించాలనుకోవడం దారుణమని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొప్పర్తిలో ఉన్న ఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయంను కూటమి ప్రభుత్వం అమరావతికి తరలించాలనుకోవడం దారుణం అన్నారు.

యాదవ మహా సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఓబులేసు

కడప ఎడ్యుకేషన్: అఖిల భారత యాదవ మహా సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా డి.ఎం. ఓబులేసు యాదవ్ ఎన్నికయ్యారు. ఆదివారం రాయచోటిలో జరిగిన యాదవుల సమైక్య సభలో రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఓబులేసు యాదవ్‌ను ఎన్నుకున్నారు.

రేపు ఐక్య ప్రజాస్వామ్య సమ్మేళనం

కడప రూరల్ : రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే ఐక్య ప్రజాస్వామ్య సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జాతీయ సమన్వయకర్త సంగటి మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. భారత రాజ్యాంగం ఆమోదం పొంది ఈనెల 25వ తేదికి 75వ సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఐక్య ప్రజాస్వామ్య సమ్మేళనం నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి అభ్యుదయవాదులు, ప్రజా సంఘాల నేతలు హాజరు కావాలని ఆయన తెలిపారు.

ఘనంగా గౌరిదేవి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

జమ్మలమడుగు : కార్తిక మాసం సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు గౌరిదేవి గ్రామోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి నామ స్మరణంతో మోస్తూ ఊరేగించారు.

కార్తికంలో కొలువు దీరిన సిద్ధలింగేశ్వరుడు

- నేడు చివరి కార్తిక సోమవారం


నామాలగుండు వద్ద ఉన్న సిద్ధలింగేశ్వరస్వామి ఆలయం


ఆలయంలోని స్వామి మూలవిరాట్


కొండలలో నుంచి వస్తున్న జలపాతం

పులివెందుల రూరల్ : కార్తిక మాసం అనగానే శైవ క్షేత్రాల్లో గుర్తుకు వచ్చే ఆలయాల్లో సిద్ధలింగేశ్వర ఆలయం ఒక్కటి. పులివెందుల మండలం కనంపల్లె గ్రామ సమీపంలోని నామాల గుండు వద్ద వెలసిన సిద్ధలింగేశ్వరస్వామికి కార్తిక శోభ సంతరించుకుంది. అటు ఇటు ఎత్తైన కొండలు, పారే వాగు ప్రకృతి సొయగాల మధ్య నామాలగుండు సిద్ధలింగేశ్వరుడు ప్రాచీన కాలం నుంచి పూజలు అందుకుంటున్నాడు.

ఆలయ చరిత్ర..

పులివెందులకు 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న కనంపల్లె గ్రామ సమీపంలోని పాలకొండల్లో ఆలయం వెలసింది. సిద్ధలింగేశ్వరుడు భక్తుల కోర్కెలు తీర్చడంలో ప్రసిద్ధి గాంచాడు. అలాగే మలయప్ప కొండగా పిలువబడటంతో మల్లేశ్వరుడిగా కూడా ఆరాధిస్తున్నారు. నామాల గుండు దగ్గర నుంచి వందమెట్లు ఎక్కిన తర్వాత సిద్ధలింగేశ్వరుడు దర్శనం ఇస్తాడు. దేవాలయం పై భాగంలో శిలాపేటు నుంచి ఆకాశగంగ అనుపేరుతో నిత్యం నీటి ధార శివాలయంపై పడి నంధీశ్వరుడి నోటి ద్వారా కొలనులో పడుతుంది. ఆ నీటిని భక్తులు పరమ పవిత్రంగా భావిస్తారు. సంతానంలేని వారు, అనారోగ్యంగా ఉన్న వారు, కుటుంబ అభివృద్ధికి కోసం ఈ నీటిని సేవిస్తారు. ఈ నీటిని సేవిస్తే సకల పాపాలు పోతాయని భక్తుల విశ్వాసం. దేవాలయం పై భాగంలో ఉన్న తేనే టీగలు పరిశుభ్రంగా రాని వారిని అవి బాధిస్తాయని పెద్దల నమ్మకం. ఈ ఆలయం కార్తిక మాసం, శివరాత్రి రోజు భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుంటారు.

కార్తిక మాసోత్సావాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

కార్తిక మాసోత్సవాలలో భాగంగా సోమవారం చివరి వారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు.